


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

11

(సెప్టెంబర్ 26, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం )

# ఏ ఉదయమైనా అవే పాదాలుగా..!!

**"పోయింది! పోయింది! ఎలా పోయిందో పోయింది"**

"ఏమి పోయిందే! ఎందుకంత గాబరా పడుతున్నావు!.. మెడలో గొలుసు అలాగే ఉంది. చెవులకు దిద్దులు అతుక్కునే ఉన్నాయి. గాజులు లెక్క చూడనీ"

"అక్కరలేదండి! అవి సరిగా ఉన్నాయి. పోయింది వేరు!"

"ఏమిటది! నాతో కూడా చెప్పరాదూ! నేకూడా వెతుకుతాగా?"..

"మీ కెందుకు శ్రమ?.. నే పోగొట్టుకున్నది నే వెతుక్కోలేను?... మీరు గడ్డానికి సబ్బు రాసుకున్నారుగా? ఆ పని సొంతం కానియ్యండి!.."

"నా పని కేమిలేవే! నువ్వలా విచారపడుతూ వెతుకుతూంటే నేను నీట్‌గా షేవ్ చేసుకుని తిరగనా!"

"మరేం ఫర్వాలేదు.. అది మన సొమ్మయితే దొరుకుతుంది. లేకపోతే అంతే గతి! లేచిన వేళ మంచిది కాదు."

"అబ్బబ్బ! అంత విలువైన వస్తువు ఏం పోయిందే! "

"విలువలకు అంతేముంది? పది నయాపైసలకూ విలువ ఉంది. పది లక్షల మూటకూ విలువ ఉంది. అది ఆయా సందర్భాలను బట్టి ఉంటుంది. ఇంతకీ.. పోయింది.. అవకాశం పోయింది.. చక్కటి అవకాశం.."

"ఏమిటి ఏం చేద్దామనుకున్నావు! ఎలా మరిచిపోయావు.. మళ్ళీ అదే అవకాశం వచ్చే అవకాశంలేదా?

"ఏదైనా రావచ్చు. కానీ ఈ రోజు ఉదయం రేపు రాదు. కాదండీ! ఆ ఉదయం ఇంతకన్నా మంచిది కావచ్చు. నా ఆశయం మరింత గొప్పగా నెరవేరవచ్చు. కాని, ఈ రోజు పోయినట్లేగా.. ఇంతకీ అమూల్యమైన ఉదయాన్ని ఆశించిన ఉదయాన్ని పోగొట్టుకున్నానండీ!" అని ఆమె ఎంతో విచారం వెలిబుచ్చింది.

"ఏం ఆశించావు?.. ఏం పోగొట్టుకున్నావు? నువ్వంత చింతాక్రాంతురాలివై ఉంటే - నాకేంతోస్తుంది చెప్పు? అర్ధాంగివి - నా ఆత్మను పంచుకున్నదానివి.. నా ప్రాణాలు నీవిగా భావించిన దానివి. చెప్పు పోనీ ఈ రోజు ఆఫీసుకి సెలవు పెడతా" అని ఆయనగారు ఎంతో దీనత్వం వహించాడు.

"మీరలా బిగలాపడుతూంటే - చెప్పకుండా ఉంటానా! చెబుతాను.. కానీ మీరేమీ అనుకోకుండా ఉండాలి. "

"ఏమీ అనుకోను. వీలైతే నువ్వు పోగొట్టుకున్నది నే వెదికి పెడతా. నువ్వు చెయ్యలేనిపని నేను చేసిపెడతా. నీ మనస్సు సంతోషంగా ఉంచడమే నాక్కావలసింది. తప్పక చేస్తా - చప్పున చెప్పు"

"చెబుతాగాని, మీరు మాత్రం ఆ పని చేయడానికి ప్రయత్నించకండి. అది ఫక్తునే చెయ్యవలసిన పని. నేను తరించేపని.. పెద్దలు, వారి తర్వాత దేవతలు సంతోషించే పని" -

"అంత మంచిపని అయితే చెబుదూ.. సంతోషిస్తాను. నీకేదైనా బహుమానం ఇస్తాను."

"చెయ్యలేదుగా... ఏం బహుమానం ఇస్తారు. ఏం లేదండీ! ఇవ్వాళిటినుంచీ నిద్రలేవగానే మీ పాదాలకు నమస్కారం చేద్దామనుకున్నానండీ. ఆరునెలలు అలా వ్రతంలాగా, నియమంలాగా నిర్వహిద్దామనుకున్నానండీ! మీ కంటే ముందుగా నిద్రలేచి - మీకు తెలియకుండానే పాదాలు కళ్ళకు అద్దుకుందామనుకున్నా. ఒకవేళ మీరు ముందు లేచినా మళ్ళీ కాసేపు మంచం మీద వాలమని బ్రతిమాలి పాదాలు కళ్ళకు అద్దుకుని 'ఇకలేవండి' అందామనుకున్నాను. మొదటిరోజునే వ్రతభంగమైంది. ఇప్పుడు ఎనిమిది కూడా అయింది. ఏం లాభం?" అన్నదామె.

"అంతేకదా!.. పోనీ ఇప్పుడు మళ్ళీ కాసేపు పడుకుంటాను. నీ వ్రతం ప్రారంభించు. దానికి ఆటంకం రావడం దేనికి? కాకపోతే కొంచెం ఆలస్యమైంది. అయినా ఎంత పొద్దెక్కినా అవే పాదాలు కదా! అంత విచారపడటం దేనికి" అన్నాడు భర్త.

"ఇంకో ఉదయం ప్రారంభిస్తాలెండి. ఇవ్వాళకి అవకాశం జారిపోయింది" అన్నదామె.

"ఉదయాలన్నీ ఒక్కటే! మన ఉభయులం ఉభయులమేగా! మరి నీ కంత అభిలాష కలిగినప్పుడు ఎందుకు ఆలస్యం?" అన్నాడాయన.

"అలా ఎలాగండి? ఎప్పుడు పడితే అప్పుడు కాళ్ళు పట్టుకుంటే ఏదో తప్పు చేసి కాళ్ళు పట్టుకున్నట్టు ఉంటుంది గానీ - భక్తితో, ఆసక్తితో అందుకున్నట్టుండదు. అందులో మీరు అడిగినప్పుడు నేను పట్టుకోవడమా! మరి ఒకసారి ప్రయత్నిస్తాలెండి" అని ఆవిడ వాయిదా వేసిందట. పోనీలే నీతో వాదన దేనికని ఆయన ఊరుకున్నాడుట.

పూర్వకాలంలో ఒకాయన వయస్సులో ఉండగా మనస్సు గతితప్పి ఒక వయ్యారితో సయ్యాటలు ప్రారంభించాడట. ఆ విధంగా ఆయనకోసం కాలం ఉయ్యాలలూగిందట. ఇంతలో పెళ్ళిచేశారు పెద్దవాళ్ళు. మొదట చెప్పిన వయ్యారికి నగలు చేయిస్తాననీ, వ్రత చేయిస్తానని ఎన్నో బాసలు చేశాడుట. కానీ, నెరవేర్చలేదు. పెళ్ళి చేసుకుని దూరంగా వచ్చేశాడు.

వయ్యారికి వళ్ళు మండింది. ధర్మమైన పెళ్ళిళ్ళు జరిగితే కుళ్ళు పుట్టే కుబుద్దులుంటారు - అందులో కులటలుండటంలో ఆశ్చర్యమేం ఉంది. వాగ్దానాలు నెరవేర్చలేదని అలనాటి వలపుకాని వెంట పడిందట. అతను సరి అయిన జవాబు చెపుతాడా!

కొందరైతే అంతకు ముందే హృదయాలు ఒకరికిచ్చేసి పెళ్ళి సమయంలో జామీను మీద విడుదలయైన ఖైదీలలాగా సంచరిస్తారు. మళ్ళీ వెళ్ళి ఆ బందీలో పడతారు.

ఈ వయసుకాడు కొంచెం గడుసు కాడు. భార్యమీదకు మనస్సు మళ్ళించుకున్నాడు. అందువల్ల ప్రియురాలివంక చూడలేదు. ఆమె ఒకసారి కనిపించి "నాకు సొమ్మన్నా ఇయ్యి - నా స్వంతమనిషిని కావుగా" అందిట.

దానికి అతడు పక పక నవ్వి "కొంతకాలం సొంతమే! అసొంతం ఇంత దబ్బున సొంత అయిపోతుందనుకోలేదు. నిజం చెబుతున్నాను. నువ్వు నా పెళ్ళికి ధైర్యం చేసి వచ్చినట్లయితే, నా కట్నంలో నుండి తీసి వెయ్యిమాట పదహార్లు నీకిచ్చేవాణ్ణి. అప్పుడిస్తే బహుమానం క్రింద ఉండేది. ఇప్పుడిస్తే భయపడి ఇచ్చినట్లుంటుంది. అవకాశం పోయింది. ఏం చేస్తాం?" అన్నాడట.

కొందరిలా ఏదో చేద్దామనీ, అవకాశాలు పోవడం వల్ల విరమించామనీ, నిర్వచిస్తూ ఉంటారు. మా బంధువుల్లో ఒక కుర్రవాడున్నాడు. అతడొకరి ఇంటికి వెళ్ళాడు. వాళ్ళ అమ్మాయిని చూశాడు. మంచిగా మాట్లాడింది. మర్యాదలు చేసింది. అప్పుడు తెలిసింది ఆమెకు అప్పటికే పెళ్ళి ఐపోయిందని! మరి ఇతడు చింతాక్రాంతుడయ్యాడు.

కానీ ఒక్క సంతోషం మాత్రం మిగుల్చుకున్నాడు మనస్సులో. ఏమిటి.. ఆ అమ్మాయి పెండ్లికి ముందే తను వారి ఇంటికి వెళ్ళినట్లయితే - ఆ అమ్మాయి తప్పకుండా తనను వరించి వివాహమాడేదని. తను వెళ్ళక పోవడం లోపమైంది. అవకాశం పోయింది. కొందరికి ఇదోరకం తృప్తి.

Comment on this article..